
నమస్తే తెలంగాణ

# నిజామాబాద్

5 | నిజామాబాద్, మంగళవారం 13 ఫిబ్రవరి 2024 | NIZAMABAD




- కాసుల కోసం కక్కుర్తి.. కమీషన్ల కోసం రెఫరల్ దందా
- చెప్పిన దవాఖానకు వెళ్లకపోతే ప్రథమ చికిత్స బంద్
- పట్టించుకోని వైద్యారోగ్యశాఖ

జిల్లాలో ఆర్ఎంపీ, పీఎంపీల ఆగడాలు


**జిల్లాలో** ఆర్ఎంపీ, పీఎంపీల ధనదాహం తారాస్థాయికి చేరుతున్నది. తెలిసీ తెలియని పరిజ్ఞానంతో ఆర్ఎంపీ, పీఎంపీలు హద్దుదాటి వైద్యం చేస్తుండడంతో అమాయకులు బలవుతున్నారు. నిబంధనల మేరకు ఆర్ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లలో ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి. సూది మందు, సెలైన్లు ఎక్కించకూడదు. కానీ అడిగేవారు లేకపోవడంతో ఏకంగా అత్యవసర కేసులను ఎల్లవేళలా చూస్తామని బోర్డులే పెట్టేస్తున్నారు. క్లినిక్‌లలోనే మందుల దుకాణాలు నిర్వహిస్తూ నిబంధనలు అతిక్రమిస్తున్నారు. చాలా ప్రాంతాల్లో ఏకంగా పడకలను సైతం ఏర్పాటు చేసుకొని సెలైన్లు ఎక్కిస్తున్నారు. ప్రథమ చికిత్సను మరిచి సొంతంగా మందులు రాసివ్వడం, వారే విక్రయించడం చేస్తున్నారు. నగరాలతోపాటు మండల కేంద్రాలు, గ్రామ పంచాయతీల్లోనూ ఆర్ఎంపీ, పీఎంపీలు ఆడిందే ఆటగా సాగుతున్నది.

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 12

# హద్దు మీరుతున్నారు

### ప్రైవేటు దవాఖానలతో కలిసి దోపిడీ..

జిల్లాలో ప్రైవేటు దవాఖానలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. నగరంలోనే 400వరకు ప్రైవేట్ దవాఖానలు ఉండగా, ఇందులో 50వరకు మల్టీ సూపర్ స్పెషాలిటీ దవాఖానలు ఉన్నాయి. పేరుకు మాత్రమే మల్టీ స్పెషాలిటీ దవాఖానలు కాగా అందులో ఒకరు లేదా ఇద్దరు డాక్టర్లు మాత్రమే సేవలందిస్తారు. సిబ్బంది ఉండరు. బిల్లులు మాత్రం లక్షల్లో ఉంటాయి. పీఎంపీ, ఆర్ఎంపీలు రిఫరల్ చేయడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తున్నది. ఒకప్పుడు ఎంబీబీఎస్, ఎండీ ఆపైన చదివిన వారు మాత్రమే క్లినిక్‌లు పెట్టుకొని రోగులకు వైద్యం చేసేవారు. ఇప్పుడు వైద్యం వ్యాపారంగా మారింది. ముగ్గురు, నలుగురు కలిసి ఈ దందాలోకి దిగుతున్నారు. భవనాలను అద్దెకు తీసుకొని వైద్యులను నియమించుకొని దవాఖానలు ఏర్పాటుచేస్తున్నారు. పెట్టిన పెట్టుబడి కేవలం ఏడాదిలోపే సంపాదించేలా ప్రణాళిక వేసుకొని కమీషన్ల దందాకు తెరతీస్తున్నారు. ఇందుకోసం గ్రామాల్లోని ఆర్ఎంపీ, పీఎంపీలతో కమీషన్లు మాట్లాడుకుంటుండడం విశేషం.



### చెప్పినా వింటలేరు..



జిల్లా వ్యాప్తంగా 44 పీహెచ్‌సీ సెంటర్లు ఉన్నాయి. ఎంబీబీఎస్, ఎండీ, నర్సింగ్ చేసిన వారు సేవలందిస్తున్నారు. కానీ ప్రజలు పీఎంపీ, ఆర్ఎంపీలను సంప్రదించి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ప్రజల్లో అవగాహన లేకనే రోగులను ఆర్ఎంపీ, పీఎంపీలు మోసం చేస్తూ కమీషన్ల కోసం ప్రైవేట్ దవాఖానలకు రిఫర్ చేస్తున్నారు. వాళ్లు చెప్పే మాటలను నమ్మి మోసపోతున్నారు. జిల్లాలో ప్రస్తుతం మూడు ఆర్ఎంపీ, పీఎంపీ యూనియన్లు ఉన్నాయి. గతంలో చాలాసార్లు చెప్పినా పద్ధతి మార్చుకోవడం లేదు.

**- డాక్టర్ సుదర్శనం, డీఎంహెచ్‌వో, నిజామాబాద్**

### కాసుల కక్కుర్తే..

ప్రైవేటు దవాఖానలు, డయాగ్నోస్టిక్ సెంటర్లతో చేసుకున్న ముందస్తు ఒప్పందాలతో తమ వద్దకు వచ్చే వారిని ఆర్ఎంపీలు భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. పరీక్షల పేరుతో ల్యాబ్‌లకు, మెరుగైన వైద్యం పేరుతో ప్రైవేటు దవాఖానలకు పంపుతూ కాసుల పంట పండించి, అందినకాడికి వెనకేసుకుంటున్నారు. తాము చెప్పిన దవాఖానకు వెళ్లకుంటే మరోసారి సంప్రదించే జనాలకు ప్రథమ చికిత్స చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. జిల్లాలో పట్టణాలు, పల్లెల్లో కలిపి సుమారు 3 వేల వరకు ఆర్ఎంపీ, పీఎంపీలు ఉన్నారు. ప్రైవేట్ దవాఖానల నిర్వాహకులు ఆర్ఎంపీ, పీఎంపీల వివరాలను సేకరించి వారిని సంప్రదిస్తున్నారు. దవాఖానలో చేరిన రోగి బిల్లులో 40 నుంచి 50శాతానికి పైగా కమీషన్ ఇచ్చేలా ముందస్తుగానే ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఒప్పందం ప్రకారం వారం, నెలకోసారి కమిషన్ ముట్టజెబుతున్నారు. ఎక్కువ మంది రోగులను పంపిన వారికి గోవా, బ్యాంకాక్ ట్రిప్పులను సైతం ఆఫర్ చేస్తుండడం విశేషం. ఇదే అదనుగా కొంతమంది ఆర్ఎంపీ, పీఎంపీలు తాము పంపించే దవాఖానలో తక్కువ ఫీజు తీసుకుంటారంటూ రోగులను ప్రైవేటు దవాఖానలకు పంపి కమీషన్లు దండుకుంటున్నారు.

### ఫిర్యాదు చేసినా పట్టింపు కరువు...

ఆర్ఎంపీ, పీఎంపీల ఆగడాలపై కొందరు ఫిర్యాదు చేయగా కొంతమంది జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలోకి వచ్చి సిబ్బందికి ముడుపులు చెల్లించుకుంటున్నట్లు సమాచారం. ఇటీవలె ఆర్మూర్‌లో రెండు క్లినిక్‌లు, అర్సపల్లిలో ఒక క్లినిక్ సీజ్ చేసినప్పటికీ యూనియన్ల పేరిట కమిషన్లు ఇచ్చి మళ్లీ తెరిపిస్తున్నట్లు తెలిసింది.

## ఘనంగా భక్త మార్కండేయ జయంతి



బాన్సువాడలో వేడుకల్లో పాల్గొన్న డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో శ్రీ భక్త మార్కండేయ జయంతి ఉత్సవాలను ప్రజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. పలుచోట్ల కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పద్మశాలీ కుల సంఘ సభ్యులు వేడుకల్లో పాల్గొన్నారు.

## 15 నుంచి వన్ డిస్ట్రిక్ట్- వన్ ఎగ్జిబిషన్

కంఠేశ్వర్, ఫిబ్రవరి 12: నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్‌డెవలప్‌మెంట్(నాబార్డు) సహకారంతో తెలంగాణ స్టేట్ ఇన్నోవేషనల్ సెల్ ఆధ్వర్యంలో వన్ డిస్ట్రిక్ట్-వన్ ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు టీఎస్ఐసీ పీఆర్ మేనేజర్ బుద్ధవరపు వాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా రాష్ట్రంలోని మూడు జిల్లాల్లో నిర్వహిస్తుండగా, నిజామాబాద్ జిల్లాలో ఈ నెల 15 నుంచి 17 వరకు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

## నిధుల మంజూరుకు కృషి చేస్తా..



గదిని ప్రారంభిస్తున్న నాబార్డు చీఫ్ జనరల్ మేనేజర్ సుశీల

రెంజల్,ఫిబ్రవరి 12: సాటాపూర్ వార సంతలో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు నాబార్డు ద్వారా నిధుల మంజూరుకు కృషి చేస్తానని చీఫ్ జనరల్ మేనేజర్ చింతల సుశీల అన్నారు. సాటాపూర్‌లో నాబార్డ్, జీపీ నిధులతో నిర్మించిన (మార్కెట్‌యార్డు) షెడ్లు, గదిని సోమవారం ఆమె ప్రారంభించారు. డీజీఎం శ్రీనివాస్, డీడీఎం ప్రవీణ్‌కుమార్, ఎస్ఐడీఎస్ ఈడీ గంగాధర్‌రావు, జడ్పీటీసీ మేక విజయాసంతోష్ పాల్గొన్నారు.

# కర్కశత్వం

## అమాయకుడ్ని చంపేశారు

- పశువుల కాపరిపై ప్రతాపం
- మచ్చుకైనా కనిపించని మానవత్వం
- డ్రెయినేజీ తీసే కర్రలతో ఈడ్చుకెళ్లిన వైనం
- సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోలు



వినాయకనగర్, ఫిబ్రవరి 12: మానవత్వం మంటగలిసింది. అనుమానం అమాయకుడ్ని పొట్టన బెట్టుకుంది. స్థానికుల అత్యుత్సాహం పశువుల కాపరి ప్రాణం బలిగొన్నది. కిడ్నాపర్ అనుకొని కిరాతకంగా కొట్టి చంపేశారు. నిజామాబాద్ నగరంలో సోమవారం జరిగిన ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇటీవల వరుస కిడ్నాప్‌ల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో తరచూ దాడులు జరుగుతున్నాయి. కాస్త అనుమానాస్పదంగా కనిపిస్తే చాలు చావబాదేస్తున్నారు. అమాయకులో, అగంతకులో కనీసం విచారించకుండా విచక్షణారహితంగా దాడి చేస్తున్నారు. ఈ తరుణంలోనే ఓ అమాయకుడు అకారణంగా హత్యకు గురయ్యాడు.

### కొట్టి చంపారు..

నిజామాబాద్ మండల పరిధిలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన రాజు (50) పశువుల కాపరి. తన కంటూ ఎవరూ లేని అతడు.. పశువులు మేపుతూ కాలం వెళ్లదీస్తున్నాడు. సోమవారం ఉదయం గాయత్రినగర్ వైపు వచ్చిన అతడి వేషధారణ చూసిన స్థానికులు కిడ్నాపర్‌గా భావించారు. ఒక్కొక్కరుగా గుమిగూడి అతడ్ని అడ్డగించారు. రాజు చెప్పేది వినకుండా కిడ్నాపరే అంటూ ఇష్టానుసారం దాడి చేశారు. ఒకరి తర్వాత మరొకరు విచక్షణారహితంగా కొట్టడంతో అతడు స్పృహ కోల్పోయాడు. కనీసం అతడికి నీళ్లు ఇవ్వాలన్న సోయి కూడా మరిచిపోయి కొడుతూనే ఉన్నారు. ఈ క్రమంలో అతడి చేతులు సైతం విరిగిపోయాయి. పూర్తిగా స్పృహ కోల్పోయిన రాజును దారుణంగా ఈడ్చుకెళ్లారు. డ్రెయినేజీలు తీసే కర్రలతో అతడ్ని లాక్కెళ్లారు. ఇదంతా సోషల్ మీడియాలో వైరల్ అయింది.

### పోలీసుల అదుపులో పలువురు..

సమాచారమందుకున్న ఫోర్త్ టౌన్ పోలీసులు అక్కడకు చేరుకుని బాధితుడ్ని దవాఖానకు తరలించారు. కానీ అతడు అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. హత్య కేసు నమోదు చేసిన పోలీసులు వీడియోల ఆధారంగా నిందితులను గుర్తిస్తున్నారు. ఇప్పటికే శ్రీధర్, గంగాధర్, మధు, రవీందర్ తదితరులను అదుపులోకి తీసుకున్నారు. మిగతా వారిని గుర్తించి అరెస్టు చేసే పనిలో నిమగ్నమయ్యారు.

### తరచూ దాడులు..

ఇటీవల చోటు చేసుకున్న పిల్లల కిడ్నాప్ వ్యవహారం తర్వాత సోషల్ మీడియాలో విపరీతమైన ప్రచారం జరుగుతున్నది. పిల్లల్ని ఎత్తుకుపోయే ముఠాలు సంచరిస్తున్నాయంటూ పాత వీడియోలు వైరల్ చేస్తున్నారు. చిన్నారుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, అనుమానితులను పట్టుకుని పోలీసులకు అప్పగించాలని ప్రచారం జరిగింది. ఇది జనాల్లోకి బాగా వెళ్లడం, అనుమానాస్పదంగా కనిపిస్తున్న వారిపై దాడులు చేయడం ఇటీవల బాగా పెరిగింది. మొన్న బోధన్, నిన్న ఆర్మూర్, ఇలా ఎక్కడ కొత్తవారు కనిపించినా పట్టుకుని తంతున్నారు తప్పితే పోలీసులను పిలిచి అప్పగించాలన్న సోయిని మర్చిపోతున్నారు. కొందరి అత్యుత్సాహంతో తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని పోలీసులు ప్రచారం చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.




ఏరియా దవాఖాన వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న వైద్యులు

# నల్లబ్యాడ్జీలతో వైద్యుల నిరసన

కామారెడ్డి, ఫిబ్రవరి 12: కామారెడ్డి ప్రభుత్వ దవాఖానలో రోగిని ఎలుకలు కరిచిన ఘటనలో ముగ్గురు వైద్యులను సస్పెండ్ చేయడంపై సోమవారం దవాఖాన ఎదుట తెలంగాణ టీచింగ్ గవర్నమెంట్ డాక్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. వైద్యులపై సస్పెన్షన్ ఎత్తివేయాలని, లేకపోతే మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ వైద్యులంతా కలిసి డీఎంఈ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. రోగులకు వైద్యం అందించే వరకే వైద్యుల బాధ్యత అని, దవాఖానలో ఎలుకలు ఉండకుండా చూసే బాధ్యత శానిటేషన్ సిబ్బంది, సంబంధిత అధికారులదని వివరించారు.

### మంత్రిని కలిసిన జేఏసీ..

తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులతో రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో సమావేశమయ్యారు. జేఏసీ ప్రతినిధులు విజ్ఞప్తి చేసిన పలు అంశాలపై సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వానికి విచారణ నివేదిక వచ్చిన అనంతరం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## కామారెడ్డి దవాఖాన ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ రాంసింగ్

కామారెడ్డి, ఫిబ్రవరి 12: కామారెడ్డి ప్రభుత్వ దవాఖాన ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ రాంసింగ్‌ను సోమవారం నియమించారు. కామారెడ్డి వైద్య కళాశాలలో విధులు నిర్వర్తిస్తున్న ప్రొఫెసర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ జనరల్ సర్జరీ హెచ్‌వోడీ డాక్టర్ రాంసింగ్‌ను నియమిస్తూ కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు నియామకపత్రాన్ని అందజేశారు. డాక్టర్ రాంసింగ్ సోమవారం డాక్టర్ విజయలక్ష్మి నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రోగిని ఎలుక కరిచిన ఘటనలో డాక్టర్ విజయలక్ష్మిని ప్రభుత్వానికి సరెండర్ చేసిన విషయం తెలిసిందే.



బాధ్యతలు చేపడుతున్న డాక్టర్ రాంసింగ్

## అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా బదిలీ

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 12:నిజామాబాద్ జిల్లా స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ చిత్రమిశ్రా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో అడిషనల్ కలెక్టర్‌గా అంకిత్ నియమితులయ్యారు. 2019 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన చిత్రమిశ్రాను ఏటూరునాగారం ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఐటీడీఏ) ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా ప్రభుత్వం బదిలీ చేసింది. ప్రస్తుతం ఐటీడీఏ పీవోగా పని చేస్తున్న అదే బ్యాచ్‌కు చెందిన అంకిత్‌ను నిజామాబాద్ లోకల్ బాడీస్ అడిషనల్ కలెక్టర్‌గా నియమించింది.

# అనుమానితులపై దాడులు చేయొద్దు

- జిల్లాలో కిడ్నాప్ ముఠాలు లేవు
- సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తే కేసులు
- సీపీ కల్మేశ్వర్ సింగెనవార్ హెచ్చరిక
- మూడు కిడ్నాప్ కేసులను ఛేదించామని వెల్లడి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీ కల్మేశ్వర్ సింగెనవార్

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 12: నిజామాబాద్ జిల్లాలో ఎక్కడా కిడ్నాప్ ముఠాలు లేవని సీపీ కల్మేశ్వర్ సింగెనవార్ స్పష్టంచేశారు. చిన్నారులను ఎత్తుకెళ్లే ముఠాలు సంచరిస్తున్నాయని పలువురు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని అలాంటి వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కమిషనరేట్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ హాల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజామాబాద్ వన్ టౌన్, రూరల్, ఆర్మూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన మూడు కిడ్నాప్ కేసులను వెంటనే ఛేదించామని, మూడు కేసుల నిందితులకు ఒకరితో మరొకరికి ఎలాంటి సంబంధాలు లేవని తమ విచారణలో తేలిందన్నారు. కొన్ని రోజులుగా అనుమానాస్పదంగా కనిపించేవారిపై ప్రజలు అకారణంగా దాడులకు పాల్పడుతున్నారని, అనుమానితులపై దాడులు చేయకుండా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో 15చోట్ల అనుమానిత వ్యక్తులపై దాడి ఘటనలు చోటు చేసుకున్నాయని, దాడులకు పాల్పడిన వారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో ఐదుగురిని గుర్తించామని, వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తామన్నారు.

### మత్తు పదార్థాల నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ..

సీఎం ఆదేశాల మేరకు కమిషనరేట్ పరిధిలో మత్తు పదార్థాలు విక్రయిస్తున్న వారితోపాటు వినియోగిస్తున్న వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని సీపీ తెలిపారు. మత్తు పదార్థాల చెలామణి జరిగినట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. పిల్లల బంగారు భవిష్యత్తు పాడవ్వకుండా సహకరించాలని తెలిపారు. సమావేశంలో అదనపు డీసీపీ జయరాం, ట్రెయినీ ఐపీఎస్ చైతన్య రెడ్డి పాల్గొన్నారు.

# పీఆర్, ఎక్సైజ్ శాఖల్లో బదిలీలు

ఖలీల్‌వాడి/కామారెడ్డి, ఫిబ్రవరి 12: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ అధికారుల బదిలీలు కొనసాగుతున్నాయి. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పంచాయతీ రాజ్, ఎక్సైజ్ శాఖలకు చెందిన పలువురు అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

**బదిలీపై వెళ్తున్నవారు వీరే..**

| అధికారి పేరు | బదిలీ అయిన ప్రాంతం |
|---|---|
| పి.జయసుధ, డీపీవో, నిజామాబాద్ | డీపీవో, వికారాబాద్ |
| ఐ.గోవింద్, జడ్పీ సీఈవో, నిజామాబాద్ | జడ్పీ సీఈవో, నిర్మల్ |
| బి.చందర్, డీఆర్డీవో, నిజామాబాద్ | జడ్పీ సీఈవో, కామారెడ్డి |
| సాయాగౌడ్, జడ్పీ సీఈవో, కామారెడ్డి | డీఆర్డీవో, నిజామాబాద్ |
| డి.సాయన్న, డీఆర్డీవో, కామారెడ్డి | డీఆర్డీవో, ఆదిలాబాద్ |

**బదిలీపై వస్తున్న వారు వీరే..**

| | |
|---|---|
| చక్రవర్తి తరుణ్‌కుమార్, డీపీవో, వికారాబాద్ | డీపీవో, నిజామాబాద్ |
| కె.పద్మజా రాణి, డీఆర్డీవో, మేడ్చల్ మల్కాజిగిరి | డీఆర్డీవో, కామారెడ్డి |
| బి.ఉష, జడ్పీ సీఈవో, నాగర్‌కర్నూల్ | జడ్పీ సీఈవో, నిజామాబాద్ |
| ఎస్.వామన్‌రావు, అడిషనల్ డీఆర్డీవో, సంగారెడ్డి | అడిషనల్ డీఆర్డీవో, కామారెడ్డి |

### ఆబ్కారీ శాఖలో..

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 12: నిజామాబాద్ రేంజ్ పరిధిలోని ఇద్దరు ఎక్సైజ్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సునీల్ శర్మ ఉత్తర్వులు వెలువరించారు. నిజామాబాద్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పి.దశరథ్‌ను రంగారెడ్డి డీసీగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరికీ పోస్టింగ్ ఇవ్వలేదు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.కిషన్‌ను రంగారెడ్డి ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీగా ట్రాన్స్‌ఫర్ చేశారు.ఆయన స్థానంలో రంగారెడ్డి -1 టీఎస్‌బీసీఎల్ చీఫ్ మేనేజర్‌గా పనిచేస్తున్న వి.సోమిరెడ్డిని నియమించారు.